# మాటల మూటలు

వ్యాన్ నడుస్తూవుంది, టీచర్ పిల్లలనుద్దేశిస్తూ
" మనం క్విజ్‌ను నడుపుదాం టైం పాస్ అవుద్ది, విషయాలను తెలుసుకోవచ్చు" అన్నాడు టీచర్. సరే అన్నట్టు అందరూ తలలూపారు.
" మనిషిలో నిత్యం మనిసిని కాపాడే అవయవం ఏది చెప్పండి" టీచర్ అడిగాడు.
" గుండె" ఒక విద్యార్థి తన ఎదమీద చేయివుంచుతూ అన్నాడు.
" కాదు అది పనిచేస్తేనే మనిషి, లేకపోతే శవం"
" చేతులు" అన్నాడు తన రెండు చేతులను ఎత్తి చూపిస్తూ యింకో విద్యార్థి.
"ఉహు" అంటూ ఓ సారి తన కళ్లను మూసి తెరిచాడు టీచర్.
"తల"
" కొంత కరెక్ట్"
"యిక మీరు చెప్పండి సార్" అందరు ఒకేసారి అన్నారు.
" మరి మార్కులు నాకే వొస్తాయి కదా?"
" రానీయండి"
" నాలుక" కుడిచేతి చూపుడు వేలితో తన నాలుకను చూపిస్తు అన్నాడు. అవును అన్నట్టు ఒకరిముఖాలు వొకరు చూసుకున్నారు. నోరు మంచిదైతే ఊరంతా మంచిదే అనేనానుడి మీకు తెలుసుకదా" అందరు అవునన్నట్టు తలవూపారు.
" మరో ప్రశ్న, అన్నిటికంటె శక్తివంతమైన శబ్దం ఏది?"
గొర్రెలమంద అడ్డురావటం వల్లా వ్యాన్ నిదానంగా పోతువుంది.

వెంటవున్న కాపరి తనకు పట్టనట్టె ఈల పాట పాడుతు నడుస్తున్నాడు.

" చెప్పండి"

" మీరే చెప్పండి సార్" అన్నారు పిల్లలు.

"అన్నీ నేనే చెబితె మరి మీరేమి ఆలోచిస్తున్నట్టు?"

" పోనీ మీకో క్లూ యిస్తాను" అంటుచూపుడు వేలితో పెదాలను తాకుకుంటూ ఏకాగ్రతలోకి వెళ్లి--

" మొదటి ప్రశ్నకు రెండవ ప్రశ్నకు సంబంధం వుంది" అన్నాడు టీచర్. అందరూ ఆలోచనలో పడిపోయి మౌనంగా చూస్తూవున్నారు.

"మెదడుకు మేత పెట్టండి"

"తట్టడం లేదు సార్"

" యిది చాలా లొతైన ప్రశ్న. ఆలోచిస్తే అదే తట్టుద్ది మీరాలోచిస్తేగా 'మాటఁరా' 'మాట!' అంటూ అందరివైపు చూశారు. అందరు అవునన్నట్టు నవ్వుముఖాలు పెట్టారు.

" ఇంతకు ముందు నాలుక గూర్చి అనుకున్నాం దానికి సంబంధించిన మాట గూర్చి అయితే మీరు తొందరగా క్యాచ్‌చేస్తారని దీన్ని అడిగాను. ఎదుటివాడు మాట్లాడితే మనమీద పనిచేస్తుంది. మనం మాట్లాడితే ఎదుటివాని మీద పనిచేస్తుంది. మాట అన్నింటికంటె ప్రభావం చూపిస్తుంది. అందుకే అది అన్నింటికంటె శక్తివంతమైనది. మాట స్నేహాన్ని పెంచుతుంది. తెంచుతుంది. అందుకే' మంచి మాట వరహాలమూట' అన్నారు పెద్దలు. ఒక విషయం గుర్తుంచుకొండి. మాట జారితే మళ్లీరాదు. మాట అనడానికి తెలివిని ఉపయోగించాలి. మాట వినడానికి సహనాన్ని ప్రదర్శించాలి."

"మరో ప్రశ్న వేయండి సార్" చంద్రం అడిగాడు.

" వేస్తే ఏం లాభం మీరెవరు చెప్పడం లేదు".

" కొంచెం ఈజీ ప్రశ్నలు వేయండిసార్" రెడ్డి

" అవును సార్" రసూల్.

" మనిషికి శోభనిచ్చేవి ఏవి?"

"నగలు"

"కాదు"

"విలువైన వస్త్రాలు"

"ఊహు"

" ధనం" రెడ్డి

కానేకాదు అన్నట్టు తలవూపాడు.

" భక్తి" రసూల్ చెప్పాడు

" నహి"

" విద్య" చంద్రం అన్నాడు.

" కొంతవరకు కరెక్టే కాని ప్రశ్నకు తగ్గట్టు సమాధానం చెప్పాలి"

"సరే సార్" అన్నట్టు అందరు కాస్త కదిలి కూర్చున్నారు. గట్టు, గుట్టల ఏరియారోడ్డు అంతా ఎత్తు పల్లాలు. వ్యాన్ నడుస్తూనేవుంది అతలాకుతాలంగా.

"చంద్రం చెప్పు దగ్గర్లో వున్నావు"

అందరు అతనివైపు చూశారు.

" నాకు తోచింది అంతే సార్".

" మిగతాది నేను చెపుతాను".

చెప్పండి అని అందరు శ్రద్ధగ టీచర్ వైపు చూస్తున్నారు. ఏం చెపుతాడో వినాలని డ్రైవర్ బండిని నెమ్మదిగ నడుపుతూ ఓ చెవిని యిటువైపు పెట్టాడు.

టీచర్ తన చూపుడు వేలును బొటన వేలికి ఆనించి " వినయ విధేయతలు".

" అవునవును అన్నట్టు" అందరూ వొకరి ముఖం వొకరు చూసుకున్నారు.

" ఆభరణాల కంటె, ఆస్తిపాస్తులకంటె విలువైనది."

" పోతే మనిషి మంచిగ బ్రతకాలంటే కావలసినవి ముఖ్య లక్షణాలేమిటి?"

" చెపుతాను సార్ కష్టపడి పనిచేయాలి" చంద్రం అన్నాడు.

టీచర్ నవ్వుతూ చూశాడు.

" కష్టపడే వాళ్లంతా మంచిగ బతుకుతున్నారు" మధ్యలో కల్పించుకొని క్లీనర్.

'అచ్చా' అన్నట్టు చూశాడు డ్రైవర్.

" ఆలోచించదగ్గ విషయమే" టీచర్ అన్నాడు.

" ఏదన్నా క్లూ యివ్వండి సార్" అన్నారు కొందరు.

" యింతకుముందు ప్రశ్న వ్యక్తిత్వానికి సంబంధించినదైతే ఈ ప్రశ్న బ్రతుకుదెరువుకు సంబంధించింది.

" పనితనం " వెంకట్ చెప్పాడు.

" సగం కరెక్టే, అదే మోస్తరు మరో --"

" అయితే అవిమీరు చెప్పండి సార్" మూర్తి

" మీకు గుర్తుండేటట్లు చెప్పాలంటే, ఓర్పు - నేర్పు" యిది వున్నావాళ్లు దేశంలో ఏమూలనైనా బ్రతుకగలరు. పిల్లలు చప్పట్లు కొట్టారు, టీచర్ చిరునవ్వు నవ్వాడు.

" పిల్లలూ మీరు సాంఘికశాస్త్రం చదువుతున్నారు కదా"

" అవును సార్"

" మొగల్ చక్రవర్తుల్లో ఈ దేశాన్ని బాగా పరిపాలించిందెవరు?"

" అక్బర్" ఒక్కసారే నలుగురి జవాబు.

" ఆచ్చా - చరిత్ర బాగే చదువుతున్నారన్నమాట"

" చదివినపుడు చదివింది గుర్తున్నట్టే వుంటది తరువాత ఆ॥ సం॥ ఏ యుద్ధం ఎపుడు జరిగింది లాంటివి కొన్ని గుర్తుండవు అసలు

చదివిందంతా గుర్తుండాలి, ఏం చెయ్యాలి సార్?" వెంకట్ ప్రశ్నించాడు.

" చదివితే ఎందుకు గుర్తుండదు" టీచర్. అన్నాడు.

" ఆయన చెప్పేది నిజమే సార్ నాకూ అంతే" మూర్తి.

" అంటే శ్రద్ధగా చదవటం లేదన్నమాట. చూడండి చదివితే గుర్తుంటది, గుర్తుండేటట్టు చదవాలి. అర్థం కానిదాన్ని ఒకటికి రెండుసార్లు చదవాలి. ఈ ప్రాబ్లమ్ చాలా మందిలోను వుంటుంది. దీనికి ముందు ఒకటే ప్రశాంతంగా, ఏకాగ్రతతో చదవాలి. చదివినదాన్ని ఓ సారి మననం చేసుకోవాలి. పాఠం బాగా గుర్తుండాలి అంటే టీచర్ చెప్పేటప్పుడు సరిగ్గా వినాలర్రా! విన్నదానిని అదే రోజు రెండు మూడు మార్లైె చదవాలి. అంతే యిక దానిని మీరు మరవాలన్నా మరవలేరు. దేనికైన సాధన చాలా అవసరం. సాధించలేనిది ఏం లేదు." చెప్పాడు టీచర్.

అందరూ చప్పట్లు కొట్టారు.

" ఇందాక మీరు అక్బర్ పేరు చెప్పారు కదా! ఆయన స్థాపించిన మతమేదో చెబుతారా?" " దీన్ -ఇ- ఇలాహీ" అన్నాడు రెడ్డి.

" గుడ్ దానర్థం తెలుసా ఎవరికైనా" కలయజూస్తు అన్నాడు టీచర్.

పిల్లలు తెల్లమోహం వేశారు.

" దీన్ అంటె మతం"

" ఇలాహి అంటె భగవంతుడు"

" ఆ అదే భగవంతుని మతం అని అర్థం. అందరూ కలసి బ్రతకాలి. ఆనాటి నుండి సాగుతున్న ఆలోచనే, మనం దానికి ఆచరణలో పెట్టాలి. అంతే. కలసి వుంటే కలదు సుఖం.

" సార్ ఎదురుగ ఏదో హాటల్ వున్నట్టుంది ఆపమంటారా"

" ఆపు" టీచర్ అన్నాడు.

వ్యాన్ ఆగింది అందరూ దిగారు, టీచర్ ముందుగ వెళ్లి అందరికీ 'టీ' ఆర్డరిచ్చాడు. పిల్లలు అవసరాలు తీర్చుకోవడానికి ఇటూ అటూ వెళుతున్నారు. ఒకడు తంగెడు పూలను తెంపుతున్నాడు. మరొకడు అక్కడ పడివున్న తాటికాయను పుట్‌బాల్‌ను తన్నుకు వచ్చినట్టు తన్నుకొస్తున్నాడు.

" టీ రడీ రండి" టీచర్ కేకపెట్టాడు.

అది విని అందరూ టీ టేబుల్ చుట్టూర చేరి తలా ఓ గ్లాసు అందుకున్నారు. టీ తాగుతూనే డ్రైవర్, టీచర్ రేపటి ప్రయాణం గూర్చి చర్చించుకుంటున్నారు. కొందరు విద్యార్థులు షుగర్ తక్కువుందని హోటల్‌వానితో తగువుకు దిగుతున్నారు. అది గమనించిన టీచర్ వాళ్లను సమీపించి, చల్లపరచి వ్యాన్ వైపు నడిచారు.